క్లుప్తంగా

బాల్య వివాహాలను నిర్మూలించాలి


ప్రాజెక్ట్ జిల్లా కో ఆర్డినేటర్ పి.రాజశేఖర్

పార్వతీపురం: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని బాల్య వివాహాల నిర్మూలన ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ పి.రాజశేఖర్ అన్నారు. యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్ట్ ఆఫ్ హోల్డ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిరోధం, నివారణ కోసం మత పెద్దలతో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 416 జిల్లాల్లో గత రెండేళ్లలో రెండు లక్షలకు పైగా బాల్య వివాహాలను ఆపినట్లు చెప్పారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలని సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు

పార్వతీపురం: పదో తరగతి ఫలితాలలో ఫెయిలైన గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పార్వతీపురంలోని వసతిగృహాలలో సోమవారం నుంచి శిక్షణ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను కోచింగ్‌కు పంపించాలని పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా కోచింగ్, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. బాలుర కోసం గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల.. బాలికల కోసం గిరిజన సంక్షేమ పోస్టుమెట్రిక్ వసతి గృహంలలో కోచింగ్, వసతి కల్పించినట్లు పేర్కొన్నారు.


వ్యవసాయ సిబ్బందికి సహకరించండి

• ఏఓ అవినాష్


మట్టి సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సహాయకులకు రైతులు సహకరించాలని ఏఓ ఎస్. అవినాష్ కోరారు. మండలంలోని వెంకటాపురంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో సోమవారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 44 గ్రామాల్లో 1244 నమూనాలు తీయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 182 నమూనాలు తీసినట్లు చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో ఎనిమిది చోట్ల మట్టి సేకరించాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పొలాలకు ఏయే ఎరువులు వేయాలో తెలుస్తుందని చెఆప్పరు.

వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కూలీ సంఘు నాయకులు

సాలూరు రూరల్: మండలంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘు నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘు నాయకుడు సుకూరు గంగయ్య మాట్లాడుతూ.. అటవీ,బంజరు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

సజావుగా ఇంటర్వ్యూలు

సీతంపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు మినీ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించి మండల కేంద్రంలో సోమవారం చేసిన ఇంటర్వ్యూలు సజావుగా జరిగాయి. వెంపలగూడ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, రాజుగాడిగూడ పోస్టుకు ఏ ఒక్కరూ దరఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారిని మాత్రం ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ ఇంటర్వ్యూ చేసి, అర్హత పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, ఐసీడీఎస్ పీవో పి.రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట, భద్రగిరి రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటళ్లు, షాపుల్లో అసిస్టెంట్ సివిల్ సప్లయి ఆఫీసర్ కిరణ్‌కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు, డీజిల్ అమ్మకాలు సహా హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తుండడాన్ని గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఇవే చర్యలు పునరావృతమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సమాచారం బహుదూరం..

• ప్రభుత్వ కార్యాలయాల్లో కనిపించని సమాచార బోర్డులు
• ఎంపీడీఓ కార్యాలయం బోర్డులో కనిపించని అక్షరాలు

బలిజిపేట:

ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతను పెంచడానికి దోహదపడే అస్త్రం సమాచార హక్కు చట్టం. అలాంటి చట్టాన్ని వినియోగించుకునేందుకు అవసరమైన సూచనలు ఉంచాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. చట్టాన్ని వినియోగించుకోకుండా చేసేందుకు అధికారులు పరోక్షంగా అడ్డుతగులుతున్నారు. చట్టంపై అవగాహన కల్పించాల్సిన వారే చిన్నచూపు చూస్తుండడంతో ప్రజలు తమకు అవసరమైన పూర్తి సమాచారం పొందడం గగనంగా మారుతోంది. దరఖాస్తుదారులు అడిగిన సమాచారాన్ని పూర్తిగా ఇచ్చిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఎక్కడ..?

సమాచార హక్కు చట్టం 2005 మే 11వ తేదీన అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణ, సంక్షేమ పథకాల్లో అవకతవకలను నియంత్రించేందుకు సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఆయా కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం బోర్డులు మాత్రం సక్రమంగా కనిపించవు. ఈ బోర్డుల్లో ఆయా కార్యాలయాల్లోని అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నంబర్ పేర్కొనాల్సి ఉన్నప్పటికీ, ఆయా శాఖల అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. కొన్ని కార్యాలయాల్లో చట్టం అమల్లోకి వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన బోర్డులే నేటికీ దర్శనమిస్తున్నాయి. కార్యాలయ అధికారి బదిలీ అయినప్పుడు ఆ స్థానంలో కొత్తగా వచ్చినవారి పేరు, ఇతర వివరాలను మార్పు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో బోర్డు ఆకారమే తప్ప అక్షరాలు సంపూర్ణంగా కనిపించవు. దిగువన అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నంబర్ లేదు. తహసీల్దార్ కార్యాలయంలో అయితే అసలు బోర్డే లేదు. ఇది ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి.


బోర్డులేని బలిజిపేట తహసీల్దార్ కార్యాలయం



ఎంపీడీఓ కార్యాలయంలో కనిపించని అక్షరాలతో, అడుగున సంతకం లేని బోర్డు

సమాచారం ఇస్తున్నాం..

సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కావాలని దరఖాస్తులు వస్తున్నాయి. వాటికి తగిన విధంగా సమాచారం దరఖాస్తుదారుకు అందిస్తున్నాం. కార్యాలయంలో బోర్డు ఉంది.

– నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

స్పందిస్తున్నాం..

సమాచార హక్కుచట్టంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి అడిగిన సమాచారం ఇస్తున్నాం. ఈ మధ్య కాలంలో ఐదుగురు దరఖాస్తు చేయగా.. వారు కోరిన సమాచారం అందించాం.

– రత్నకుమారి, తహసీల్దార్, బలిజిపేట

నివాళులు..


డొక్కా సీతమ్మ పేరు వింటేనే కడుపు నిండిపోతుందని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవినాయుడు తెలిపారు. పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద డొక్కా సీతమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, టి.శివ, జి.సుదర్శనరావు, బి.తాతబాబు, తదితరులు పాల్గొన్నారు. – బలిజిపేట

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి

• రైతు సంఘు జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల గ్రామ పరిధిలో నీరు పారే గెడ్డలు, కాలువలను కప్పేసి గిరిజనులపై పెత్తనం చేస్తున్న జగన్నాథం అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘు జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానికులతో కలసి డోకిశీల సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డోకిశీల రెవెన్యూ పరిధిలో గల 107, 106/11 సర్వే నంబర్‌లో ఉన్న దేసిబట్టిని మాజీ వీఆర్‌ఓ చింతల జగన్నాథం నాయుడు అనే వ్యక్తి ఆక్రమించి కాలువలను పూర్తిగా కప్పేశాడని ఆరోపించారు. ఈ ఆక్రమణలపై గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేసిబట్టి గెడ్డనీరు డోకిశీల నుంచి చింతలకోనేరు, డబ్బికోనేరు మీదుగా తాళ్లబురిడి వరకు దాదాపు 12 గ్రామాలకు చెందిన వ్యవసాయ భూములకు ఆధారమని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ వీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బేత నర్సింహారావు, బి. నాగేశ్వరరావు, బి.గణపతి, సీహెచ్ సత్యంనాయుడు, తదితరులున్నారు.


డోకిశీల సచివాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న రైతు సంఘు నాయకులు

జేసీకి వినతి..

పార్వతీపురం టౌన్: డోకిశిల రెవెన్యూ పరిధిలో ఉన్న దేసిబట్టిని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘు జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు జేసీ ఎస్.ఎస్ శోభికను కలసి వినతిపత్రం అందజేశారు. ఈయన వెంట రైతు సంఘు నాయకులు బంటు దాసు, తదితరులున్నారు.

15వ ఆర్థిక సంఘు నిధులతో అభివృద్ధి పనులు

• జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

సీతానగరం: గ్రామాల్లో 15వ ఆర్థిక సంఘు నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని జెడ్పీ సీఈఓ బీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు అవసరమైన పనుల కోసం 15వ ఆర్థిక సంఘు నిధులు వినియోగిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు, మండలపరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న గిరిజన సంఘు నాయకులు

పార్వతీపురం టౌన్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘు రాష్ట్ర కార్యదర్శి కె. సురేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పూర్తి స్థాయిలో పట్టాలు ఇవ్వలేదన్నారు. దీంతో వారి భూములను అంబానీ, అదానీలాంటి వ్యక్తులకు కట్టబెట్టాలని ప్రభుత్వం చూస్తోందని చెప్పారు. ఇప్పటికైనా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు చెక్‌డ్యామ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘు జిల్లా నాయకుడు కె. రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘు జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, నాయకులు పి. రాము పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఇలాగేనా..?

• శిలాఫలకంపై మంత్రి పేరు తప్ప కానరాని ఇతర ప్రజాప్రతినిధుల పేర్లు
• విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సాలూరు: నియోజకవర్గంలో అధికారుల వ్యవహార శైలి క్రమేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధంగా మారుతోందా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. అధికార పార్టీ పెద్దల ఆశీస్సుల కోసం అధికారులు ప్రొటోకాల్‌ను కూడా తుంగలో తొక్కుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మున్సిపాలిటీ 26వ వార్డులో దండిగాం రోడ్డు వద్ద ఈ నెల 24న పైలెట్ వాటర్ స్కీమ్ ప్రారంభోత్సవం స్థానిక మంత్రి సంధ్యారాణి చేతుల మీదుగా ఆర్భాటంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ పి.సన్యాసమ్మను ఆహ్వానించలేదు. సమాచారం ఇవ్వలేదు సరికదా.. కనీసం అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంలో చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్ల పేర్లు కూడా వేయలేదు. కేవలం మంత్రి సంధ్యారాణి పేరు మాత్రమే శిలాఫలకంలో పొందుపరిచారు. సాధారణంగా ఏ అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాల్లోనైనా రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు ఏ పార్టీలకు చెందిన వారైన ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, పలువురు అధికారుల పేర్లు పొందుపరుస్తారు. కాని ఈ శిలాఫలకంలో కేవలం మంత్రి సంధ్యారాణి పేరు తప్ప మరెవ్వరి పేర్లు లేకపోవడంపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనపై త్వరలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే యోచనలో కౌన్సిలర్ ఉన్నట్లు సమాచారం.



ఒక్కమంత్రి సంధ్యారాణి పేరుతో ఉన్న శిలాఫలకం

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

పాలకొండ రూరల్:

కార్మిక వర్గానికి నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు, పలువురు కార్మికులు స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. కేంద్రం తీసుకువస్తున్న లేబర్ కోడ్‌లు వ్యతిరేకిస్తూ మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. బ్రిటిష్ కాలం నాటి కార్మిక చట్టాలు తీసివేస్తూ కార్మికుల హక్కులు హరించేలా లేబర్ కోడ్‌లు అమలుచేయాలని చూస్తుండడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు విమల శ్రీదేవి, రఘు భాస్కరరావు, ఆంజనేయులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కార్మికులు

రహదారి ఏర్పాటుకు చర్యలు


రహదారి మరమ్మతుల కోసం వేసిన మట్టిని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

మక్కువ: మండలంలోని వెంకట భైరిపురం నుంచి డి.శిర్లాం గ్రామానికి వెళ్లే రోడ్డు (సుమారు ఒక కిలోమీటర్) పాడవ్వడంతో ఎమ్మెస్సార్ ఫౌండేషన్ సభ్యులు రోడ్డు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. గ్రామ సమీపంలోని కంతపోలమ్మ గుడి నుంచి డి. శిర్లాం వరకు రోడ్డు పాడైంది. దీంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు స్పందించి రూ. 50 వేలతో రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు రోడ్డు మరమ్మతులకు సంబంధించి సోమవారం మట్టి వేశారు. కార్యక్రమంలో మరడ సాయిరాం, రెడ్డి శ్రీరాం, పాము అప్పలస్వామి, జాగాన శ్రీను, దాసరి వెంకటరమణ, తీళ్ల రామకృష్ణ, జాగాన తిరుపతి నాయుడు, గేదెల తిరుపతినాయుడు, గుల్ల సింహాచలం, ఉరిటి సింహాచలం,తంగుడు తవిటి నాయుడు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌తో గిరిజనులకు అన్యాయం

సీతంపేట: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌తో గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు బిడ్డిక శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎన్నికలకు ముందు జీవో నంబరు 3 స్థానంలో కొత్త జీవో తీసుకువస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీ నెరవేర్చకుండానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల గిరిజనులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గిరిజన ప్రాంతాల్లో శతశాతం ఉపాధ్యాయ ఖాళీలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలన్నారు. పీసా అధ్యక్ష, కార్యదర్శులకు అధికారాలు ఇవ్వాలని, 1/70 చట్టం అమలు చేయాలన్నారు. రెట్రో సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో గిరిజనులను కించపరిచేలా హీరో విజయదేవరకొండ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇళ్లు నిర్మించని వారికి మరో అవకాశం

వీరఘట్టం: గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ వినోద్ తెలిపారు. ఇదే విషయమై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వీరఘట్టం మేజరు పంచాయతీ ప్రజలకు అచ్చెపువలస వద్ద 333 ఇళ్లస్థలాలను గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే ఇంతవరకు అక్కడ ఏ ఒక్కరూ నిర్మాణాలు చేయలేదన్నారు. వారికి ఎక్కడైనా సొంత స్థలం ఉంటే పీఎంఏవై గ్రామీణ, అర్బన్ పథకాల ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అంతేకాకుండా బీసీ, ఎస్సీ వర్గాల వారికి అదనంగా మరో రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, గదబలకు రూ.1 లక్షలు అందివ్వడం జరుగుతుందన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లంఊట ధ్వంసం

జియ్యమ్మవలస: మండలంలోని గడసింగుపురం, చినమేరంగి గ్రామాల్లో శివారు ప్రాంతాల్లో ఎక్సైజ్ శాఖ సిబ్బంది సోమవారం చేసిన ఆకస్మిక దాడుల్లో మొత్తం వెయ్యి లీటర్ల బెల్లంఊట స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు ఆ శాఖ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. అలాగే 30 లీటర్ల సారా కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు.

భామినికి బస్సులు నడపాలి

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రం నుంచి భామినికి బస్సులు నడపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ కోరారు. ఈ మేరకు డీపీటీఓ కార్యాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం ఆర్టీసీ డిపో నుంచి జిల్లాలో కొన్ని మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా భామిని మండలానికి బస్సులు లేకపోవడం బాధాకరమన్నారు.అలాగే పార్వతీపురం నుంచి గళావల్లి, పాచిపెంట, కిచ్చాడ, తాడికొండ, హెస్సేన్ పురం వరకు బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బుడితి అప్పలనాయుడు, జి. సూరయ్య, కె.బాబూరావు, నాయుడు, తదితరులు పాల్గొన్నారు.


డీపీటీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అమ్మవారి పండగలకు శ్రీకారం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం గ్రామ దేవత ఇప్పల పోలమ్మ, జగన్నాథపురం గ్రామ దేవత ఎర్ర కంచమ్మ పండగలకు పెద్దలు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పొలిమేరలో ఉన్న ఎర్ర కంచమ్మ అమ్మవారిని గ్రామ ప్రజలు, పెద్దలు ఏకమై సోమవారం రాత్రి గ్రామానికి (కొనితెచ్చు) తీసుకు వచ్చారు. మేళతాళాలతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అమ్మవారి ఘటాలతో 40 రోజుల పాటు ఊరేగింపు కార్యక్రమాలు చేపడతామని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. జూన్ 1, 2, 3 తేదీల్లో పండగలు నిర్వహిస్తామన్నారు.


అమ్మవారి ఊరేగింపు

పారిశుధ్య పనులు చేపట్టండి..


చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మకు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

సాలూరు: మా వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఈగలు, దోమలతో ఇబ్బంది పడుతున్నామని 24, 26 వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుండగానే.. ఆయా వార్డు ప్రజలు వచ్చి చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, కౌన్సిలర్లు హైమావతి, సన్యాసమ్మ, తదితరులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాలువల్లో మురుగు పేరుకుపోవడంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయని, తద్వారా జ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

• చోద్యం చూస్తున్న అధికారులు

పాచిపెంట: మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు జరిపి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. రాత్రీ, పగలు తేడాల్లేకుండా తవ్వకాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని స్థానిక పెద్దగెడ్డ జలాశయం ప్రధాన కుడికాలువ సమీపంలో జేసీబీ సహాయంతో అక్రమార్కులు మట్టిని తరలించుకుపోతున్నారు. తవ్వకాల వల్ల జలాశయానికి ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఇటు రెవెన్యూ అధికారులు గాని అటు పెద్దగెడ్డ జలాశయానికి సంబంధించిన ఇరిగేషన్ అధికారులు గాని పట్టించుకోవడం లేదు. ఇదిలా ఉంటే ఇక్కడి నుంచి తరలిస్తున్న మట్టిని గురువునాయుడుపేట నుంచి పాచిపెంట వరకు ఇటీవల నూతనంగా నిర్మాణం పట్టిన బీటీ రోడ్డుకి ఇరువైపులా వేస్తున్నారు. సాధారణంగా బీటీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ మట్టి వేయాల్సి ఉంది. కానీ బురద మట్టిని వేస్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


పెద్దగెడ్డ జలాశయం ప్రధాన కుడికాలువ సమీపంలో జేసీబీ సహాయంతో మట్టి తవ్వకాలు